క్లుప్తంగా

కోలాట బృందానికి బిందెల పంపిణీ



కోలాట మహిళలకు బిందెలు పంపిణీ చేస్తున్న రామనర్సమ్మ

మఠంపల్లి : మండలంలోని పెదవీడుకు చెందిన మహిళా కోలాట సమాజం బృందానికి స్థానిక పీఏసీఎస్ డైరెక్టర్ పశ్యా రామనర్సమ్మకృష్ణారెడ్డి దంపతులు సుమారు రూ.10వేల విలువ గల స్టీల్ బిందెలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక రామాలయం వద్ద మహిళలు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఎంఎంయాదవ్, నీటి సంఘం మాజీ చైర్మన్ బూర సోములుగౌడ్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ గాయం ఆదినారాయణరెడ్డి, కోలాటం మాస్టార్ సీహెచ్.భిక్షం, మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

పిల్లలకు బైబిల్ పాఠాలు



సర్టిఫికెట్స్ అందుకున్న చిన్నారులు

కోదాడఅర్బన్ : పట్టణంలోని నయానగర్ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ యేషయ్య ఆధ్వర్యంలో బుధవారం పిల్లలకు వేసవి బైబిల్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మంది పిల్లలు ఎంతో ఉత్సాహంగా బైబిల్ పఠనంతో పాటు యేసు కీర్తనలను ఆలపించారు. వేసవి బైబిల్ తరగతులకు హాజరైన పిల్లలకు పాస్టర్ యేసయ్య సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో కోటయ్య, జగ్గునాయక్, మన్విత, తబిత, ద్రాక్షవల్లి, విజయ, సరిత, సీత, సునీత, భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ నిరసనను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నల్లొండ మహాత్మా గాంధీ యునివర్సిటీలో గురువారం నిర్వహించే నిరుద్యోగ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకుడు అల్లం ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి నల్లొండ జిల్లాకు చెందిన నిరుద్యోగులు, పార్టీ అభిమానులు కార్యకర్తలు, నాయకులు స్వచ్ఛందంగా తరలివచ్చి ర్యాలీని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

బండి సతీష్ కుటుంబానికి అండగా నిలిచిన వీఓఏలు



ఆర్థికసాయం అందజేస్తున్న వీఓఏలు

గరిడేపల్లి : మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన వీఓఏ బండి సతీష్ ఈనెల 18వ తేదీన మృతి చెందారు. దీంతో హుజూర్‌నగర్, గరిడేపల్లి, చింతలపాలెం మండలాల వీఓఏల సంఘం నాయకులు బండి సతీష్ కుటుంబానికి అండగా నిలిచారు. బుధవారం వారు సతీష్ కుటుంబాన్ని పరామర్శించి, గరిడేపల్లి మండలం నుంచి రూ.50 వేలు, హుజూర్‌నగర్ మండలం నుంచి రూ.11 వేలు, చింతలపాలెం మండలం నుంచి రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సతీష్ ఇద్దరు కుమార్తెలు పేరుమీద డబ్బులను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయిస్తామని అన్నారు.

ఆర్థికసాయం అందజేత



రామారావు కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

చిలుకూరు : చిలుకూరు గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు వల్లపుదాసు రామారావు ఇటీవల తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందారు. బుధవారం జాగృత్ ట్రస్ట్ సభ్యులు రామారావు కుటుంబాన్ని పరామర్శించి పది వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ కేసగాని రాజశేఖర్‌గౌడ్, సభ్యులు కేశగాని సృజన, బత్తిని సత్యనారాయణగౌడ్, బత్తిని శ్రీనివాస్, మట్టపల్లి సతీష్, సురగాని లింగయ్య, సంపెట వాసు కృష్ణ, శ్రీనివాస్, రవి, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

50శాతం వాటా కల్పించాలి

గరిడేపల్లి : కేంద్ర మంత్రి వర్గం, రాష్ట్ర మంత్రి వర్గంలోనూ బీసీలకు 50 శాతం వాటా కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. బుధవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బీసీలను పూర్తిగా అణగతొక్కుతున్నారని ఆరోపించారు. బీసీల హక్కుల కోసం ఉద్యమించేటప్పుడు రాజకీయాలకు అతీతతంగా తరలిరావాలన్నారు.

ఖాళీ కుర్చీలే దర్శనం!

- బేతవోలు జీపీలో అందుబాటులో ఉండని ఇన్‌చార్జ్ కార్యదర్శి
- పదిహేను రోజులుగా విధులకు హాజరుకాని బిల్ కలెక్టర్
- నాలుగు నెలలుగా జీతాలందక ఇబ్బందుల్లో సిబ్బంది



బేతవోలు గ్రామ పంచాయతీలో ఖాళీగా దర్శనమిస్తున్న కార్యదర్శి కుర్చీ



బేతవోలు గ్రామ పంచాయతీ కార్యాలయం

చిలుకూరు : మండలంలో బేతవోలు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిత్యం ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. ఎప్పుడూ చూసినా గ్రామ పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండడం లేదు. దీంతో వివిధ పనుల మీద కార్యాలయానికి వచ్చే గ్రామస్తులకు తిప్పలు తప్పడం లేదు. మరోపక్క పంచాయతీ సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

రెండు మేజర్ పంచాయతీలు కావడంతో..

అయితే గత ఏడాది సెప్టెంబర్‌లో పెన్షన్‌కార్డుల పంపిణీ విషయంలో జరిగిన ఓ ఘటనతో బేతవోలు గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్‌ను ప్రభుత్వం సెస్పెండ్ చేసింది. ఆ తరువాత కొద్ది రోజులకు అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శిగా రామకృష్ణని నియమించారు. కాగా ఈ ఏడాది ఫిబ్రవరిలో గ్రామంలో జరిగిన ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో అలసత్యం వహించిన రామకృష్ణను కూడా సస్పెండ్ చేశారు. దీంతో మార్చి 3వ తేదీన కొండాపురం గ్రామ కార్యదర్శి కార్తీక్‌కు బేతవోలు గ్రామ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే రెండూ మేజర్ గ్రామ పంచాయతీలు కావడం, ఉపాధి హామీ పనులు, పల్లె ప్రగతి పనులు ముమ్మరంగా జరగడం, ఈ రెండు గ్రామాలకు ఫీల్డ్ అసిస్టెంట్‌లు లేకపోవడంతో కార్యదర్శి పూర్తిస్థాయిలో బేతవోలు గ్రామంలో విధులు నిర్వహించలేకపోతున్నారు. ఇదిలా ఉండగా నెలరోజుల క్రితం బేతవోలు గ్రామానికి గ్రేడ్–1 అధికారిగా రామును నియమించారు. అయితే ఉద్యోగంలో చేరే రోజునే ఆయన మద్యం మత్తులో మండల పరిషత్ కార్యాలయలంలో కింద పడి గాయాల పాలై విధుల్లో చేరకుండానే వెళ్లిపోయారు. ఇక బిల్ కలెక్టర్ విధులకు రాక పదిహేను రోజులు దాటింది. దీంతో కార్యాయలంలో ఉన్న రెండు కుర్చీలు ఖాళీగానే ఉన్నాయి.

జీతాలు అందక కార్మికుల ఇబ్బందులు..

కాగా, బేతవోలు గ్రామ పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు లేకపోవడంతో గ్రామ పంచాయతీ ఇంటి బిల్లులు వసులు చేసే పరిస్థితి లేదు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో పంచాయతీ ఖాతాల్లో నిధులు లేవు. దీంతో జీపీ కార్మికులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. జీతాలు ఇవ్వమని కార్మికులు అడగగా నిబంధనల ప్రకారం సాధారణ నిధుల ఖాతా నుంచి మాత్రమే జీతాలు ఇస్తానని సర్పంచ్ వట్టికూటి చంద్రకళ నాగయ్య అంటున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కార్మికులకు జీతాలు ఇవ్వమని అధికారులు చెబుతున్నారు. అయితే 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్రం నిధులు అని వాటిని జీతాలకు వాడుకొనే అవకాశం లేదని, నిబంధనలకు విరుద్ధమని సర్పంచ్ అంటున్నారు. సర్పంచ్‌కు అధికారుల మధ్య కొంత వివాదం నెలకొనడంతోనే కార్మికులకు జీతాలు అందడం లేదని తెలుస్తోంది. తక్షణమే ఉన్నత స్థాయి అధికారులు స్పందించి బేతవోలు గ్రామ సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

గన్నీ బ్యాగులు ఇవ్వాలని ఆందోళన



త్రిపురవరంలో పీఏసీఎస్ కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

అనంతగిరి : మండల పరిధిలోని త్రిపువరం పీఏసీఎస్ కేంద్రంలో గన్నీ బ్యాగులు ఇవ్వాలని, కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎగుమతి చేసేందుకు లారీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో ధాన్యం సంచుల కొరత, ధాన్యం బస్తాల తరలింపునకు లారీల లేకపోవడంతో ధాన్యాన్ని కల్లాలోనే ఉంచాల్సి వస్తుందని, దీంతో వర్షాలకు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నందున అధికారులు వెంటనే స్పందించాలని సుమారు 50 మంది రైతులు పీఏసీఎస్ కేంద్రం వద్ద రోడ్డుకు అడ్డంగా ధర్నా చేపట్టారు. దీంతో స్పందించిన పీఏసీఎస్ చైర్మన్ పుట్టా రమేష్ ప్రతిరోజు ధాన్యం బస్తాలతో పాటు, హమాలీల సంఖ్య పెంచి, రెండు నుంచిమూడు లారీలు అందుబాటులో ఉంచుతామని రైతులకు హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు. కార్యక్రమంలో గుర్రం వెంకటరెడ్డి, అనంతరెడ్డి, రంగారెడ్డి, ఇస్మాయిల్, వీరారెడ్డి, పి.వెంకటరెడ్డి, జి.వీరారెడ్డి, అచ్చిరెడ్డి, బజారు, వెంకన్న, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ్ హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున్

హుజూర్‌నగర్ : ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గతంలో ఎమ్మెల్యేగా ఉన్న హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి జరిగిందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తన్నీరు మల్లికార్జున్ అన్నారు. మున్సిపాలిటీలోని 10వ వార్డులో ఎంపీ నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వార్డు ఇన్‌చార్జ్ బాచిమంచి గిరిబాబు, మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కస్తాల శ్రవణ్, కౌన్సిలర్లు రాజనాయక్, కోతి సంపత్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణరెడ్డి, వెంకటరెడ్డి, వెంకన్న, నారాయణరెడ్డి, పూజారి తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనే సీపీఐ లక్ష్యం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాములు

హుజూర్‌నగర్ : హక్కుల కోసం పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరులకు గుర్తుగా మేడే వేడుకలు జరుపుకుంటున్నామని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు తెలిపారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాడితే పోయేదేమి లేదు బానిస సంకెళ్లు తప్ప అని అన్నారు. సమసమాజ స్థాపనే సీపీఐ లక్ష్యమని చెప్పారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసేది ఏఐటీయూసీ అని తెలిపారు. మేడే వేడుకలను సయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కంబాల శ్రీనివాస్, జడ శ్రీనివాస్, దేవరం మల్లేశ్వరి, గుండు వెంకటేశ్వర్లు, వై.రమేష్, డి.సత్యనారాయణ, జి.రమేష్, జె.వెంకన్న, పి.వెంకట్‌రెడ్డి, సైదులు, కృష్ణ, స్టాలిన్, ఉమ, ఎం.వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు.. ముగ్గురు అరెస్ట్



పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలోని రెండు మండలాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి దాడులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గరిడేపల్లి మండలం దూపాడుకు చెందిన అరవింద్ అనే వ్యక్తి గడ్డిపల్లిలో సారా తయారీదారులకు బైక్‌పై బెల్లం తరలిస్తుండగా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 50 కేజీల బెల్లం, 10 కేజీల పటికను స్వాధీనం చేసకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా చింతలపాలెం మండలం పీక్లానాయక్ తండాకు చెందిన బాణోతు సుమన్, బాణోతు గోపి ఇంట్లో ఉన్న 100 కేజీల బెల్లం, 10 లీటర్ల సారా, 7 డ్రమ్ములలో ఉన్న 1400 లీటర్ల బెల్లం పానకంను స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు సతీష్ కుమార్‌రెడ్డి, దివ్య, వెంకన్న, సిబ్బంది రవి, నాగరాజు, జయరాజ్, ధనుంజయ్, రాము నాగమణి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న నయీం

కోదాడఅర్బన్ : ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేలో ప్రతి ఒక్క కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్‌కేవీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నయీం పిలుపునిచ్చారు. బుధవారం కోదాడలో జరిగిన కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. కార్మికులు కష్టపడి తెచ్చుకున్న చట్టాలను కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రద్దు చేస్తూ కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌కేవీ కార్మిక అనుబంధ సంఘాల ప్రతినిధులు నర్సయ్య, సలీమా, బషీర్, శేషు, కందుల శ్రీను, రాజు, రఫీ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మే డే వేడుకలను విజయవంతం చేయాలి

నడిగూడెం : మేడే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుర్రి శ్రీరాములు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రపంచ కార్మికుల దినోత్సవంలో ప్రతి గ్రామంలో అధిక సంఖ్యలో కార్మికులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, ఎస్‌కే.మస్తాన్, కొరట్ల శ్రీనివాస్, ఏనుగుల వీరాంజనేయులు, బెల్లంకొండ హనుమయ్య, రేఖ తిరపయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుర్రి శ్రీరాములు

ఓటర్ జాబితాలో తప్పులు సవరించాలని వినతి

హుజూర్‌నగర్ : తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలని పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త మన్సూర్ అలీ బుధవారం తహసీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో జాబితాలలో ఉన్న తప్పులను సరిచేయాలని కోరారు.

వాడవాడలా ఎర్రజెండా ఎగురవేయాలి

హుజూర్‌నగర్ : మేడే నాడు వాడవాడలా ఎర్రజెండా ఎగురవేయాలని ఐఎఫ్‌టీయూ సీనియర్ నాయకులు మేకల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గురవయ్య, పెద్ద నాగేశ్వరరావు, రాజు, పటేల్, ముఖేష్, వీరయ్య, చిన్న నాగేశ్వరరావు, ప్రభువు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

నడిగూడెం : విద్యుదాఘాతంతో ఓ పాడిగేదె మృతిచెందింది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కుంభం శ్రీనుకు చెందిన పాడిగేదె బుధవారం మేతకు వెళ్లింది. మేత మేస్తూ స్థానిక కొత్త శివాలయం సమీపాన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. దాని విలువ దాదాపు రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

'కంటి వెలుగు' ప్రారంభం



లక్ష్మీపురంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సుజాతాశ్రీనివాస్‌గౌడ్

గరిడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ కుసుమ వెంకటమ్మశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపురంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వనజ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ జానకిరాములు, ఏఎన్‌ఎం అనిత, ఆశా వర్కర్లు, కంటి వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

నేరేడుచర్ల : క్రైస్తవుల శ్మశాన వాటికను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం నేరేడుచర్లలోని క్రైస్తవుల శ్మశాన వాటికను ఆయన పరిశీలించి మాట్లాడారు. శ్మశాన వాటికను ఆక్రమించడం అమానుషమన్నారు. ఈ విషయంపై అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పాస్టర్లు సుధాకర్, సురేష్, ధర్మయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.

ప్రతి పేదవాడికి ఇల్లు కేటాయించాలి

చిలుకూరు : నియోజకవర్గంలో ప్రతి నిరుపేదకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పచ్చిపాల వేణుయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బేతవోలులో అధికార పార్టీ నాయకులు అనర్హులకు ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కారును అడ్డుకుంటే మహిళను పోలీసులు తమ వాహనంలో తరలించడం ఏంటని మండిపడ్డారు. అధికార పార్టీకి ఆత్మీయ సమ్మేళనాల మీద ఉన్న ప్రేమ పేదవాడికి ఇళ్లు పంపిణీ చేసే దానిలో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మరోమారు ఉన్నత స్థాయి అధికారులు బేతవోలులో ఇళ్ల పంపిణీ పై విచారణ చేసి అర్హులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

పేదలు ఆత్మగౌరవంగా బతికేందుకు 'డబుల్' ఇళ్లు

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



బేతవోలులో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

చిలుకూరు : పేదలు ఆత్మగౌరవంగా బతికేందుకు సీఎం కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి పంపిణీ చేశారని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని బేతవోలు గ్రామంలో రూ. 3 కోట్ల 2 లక్షల 50 వేలతో నిర్మించిన 60 డబుల్ బెడ్ రూం ఇళ్లకు గాను లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు అని అన్నారు. ప్రభుత్వం త్వరలో సొంత స్థలం ఉన్న పేద ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కాగా ఇళ్ల పంపిణీకి వచ్చిన ఎమ్మెల్యే కారును గ్రామానికి చెందిన మహిళలు అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. అనర్హులకు ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. దీంతో పోలీసులు మహిళను పోలీసులు వాహనంలో అక్కడి నుంచి తీసుకెళ్లారు.

నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం..

బేతవోలు గ్రామంలోని సీతరామచంద్రస్వామి దేవాలయం నూతన పాలకమండలి సభ్యులతో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ప్రమాణస్వీకారం చేయించారు. చైర్మన్‌గా ఎగ్గడి శ్రీను, సభ్యులుగా అద్దోజు శ్రీనివాస్, మైసమ్మ, రామస్వామి, కోటిరెడ్డి, రాంబాబు, అచ్చయ్య, నాగేంద్రబాబులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదయ్య, తహసీల్దార్ రాజేశ్వరి, మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు అలసకాని జనార్దన్, బాషం సైదులు, వైస్ చైర్మన్ అక్కినపల్లి జానకిరామాచారి, మాజీ సర్పంచ్ తాళ్లూరి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ భట్టు శివాజీనాయక్, వెంకటేశ్వర్లు, గన్నా అశోక్, రామారావు, ప్రసాద్ గ్రామ పెద్దలు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల కళారంగానికి పూర్వవైభవం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



మఠంపల్లిలో సాంఘిక నాటకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

మఠంపల్లి : తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో గ్రామీణ రంగస్థల కళారంగానికి పూర్వవైభవం వచ్చిందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మఠంపల్లి ఎస్సీ కాలనీలో స్థానిక జోసెఫ్ తంబీ కళా నాట్యమండలి ఆధ్వర్యంలో నర్సరావుపేట హారికా సినీ సెట్టింగ్‌పై ప్రదర్శించిన తెలంగాణ టైగర్ సాంఘిక నాటకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కళలకు కిష్టపట్టె ప్రాంతం మొదటినుంచి పెట్టనికోటలా ఉందన్నారు. కాలక్రమేణా మరుగున పడుతున్న గ్రామీణ కళారంగానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం పూర్వవైభవం తెచ్చిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ భద్రంరాజు రామారావు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రామచంద్రయ్య, నాటక డైరెక్టర్ మాఘం వెంకటేశ్వర్లు, కర్ల వెంకటేశ్వర్లు, మామిడి ఆంతోని, సాయిలు, నితీష్‌కుమార్, తదితరులు ఉన్నారు.

నర్సరీ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఏపీడీ పెంటయ్య



చిలుకూరులో నర్సరీని పరిశీలిస్తున్న ఏపీడీ పెంటయ్య

చిలుకూరు : హరితహారం నర్సరీలను సమర్థవంతంగా నిర్వహించాలని అడిషనల్ పీడీ డాక్టర్ పెంటయ్య అన్నారు. బుధవారం చిలుకూరు, జానకీనగర్ గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలలో మొక్కలు చనిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. నర్సరీల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ నిర్మల, సర్పంచ్ కొడారు బాబు, ఈసీ మాధవి, టీఏ స్రవంతి, గ్రామ కార్యదర్శి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మంజుల

హుజూర్‌నగర్ : కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.మంజుల అన్నారు. పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నిధులతో ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని భవన, ఇతర నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పట్టణ కార్యదర్శి నాగారపు పాండు, పల్లె వెంకటరెడ్డి, శీలం శ్రీను, యల్క సోమయ్య, ముస్తఫా, రాములు, గోవిందు, శంకర్ మధు డాక్టర్ టి.పవన్, సీనయ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మునగాల : అకాల వర్షానికి పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నేలమర్రి సీపీఎం గ్రామ కార్యదర్శి నందిగామ సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన ఆ పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. అదే విధంగా మామిడి, మిర్చి, మొక్కజొన్న పంటల రైతులు కూడా వర్షానికి నష్టపోయారని అధికారులు పంటనష్టాన్ని అంచనా వేసి ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. మేడే వేడుకలను విజయవంతం చేయాలన్నారు. ఉపసర్పంచ్ రావులపెంట బ్రహ్మం, ములకలపల్లి సైదులు, రావులపెంట వెంకన్న, శంభయ్య, హుస్సేన్, గురుమూర్తి ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

అనంతగిరి : అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంట నష్టంపై సమీక్ష నిర్వహించి రైతులకు నష్టపరిహారం అందేవిధంగా చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

సమ్మెకు అనుమతి ఇవ్వాలని వినతి



పాలకవీడు : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జూనియర్ కార్యదర్శులు

పాలకవీడు : తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 28 నుంచి చేపట్టే నిరవధిక సమ్మెకు అనుమతి ఇవ్వాలని తహసీల్దార్ శ్రీదేవి, ఎస్‌ఐ సైదులుకు బుధవారం మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేపీఎస్ మండల కమిటీ సభ్యులు నరేందర్, వినయ్, రవిచంద్ర, అనూష, బ్రహ్మాచారి, నాగుల్ మీరా, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి నిరవధిక సమ్మె

మునగాల : సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం నాలుగు సంవత్సరాల ప్రొబేషనరీ పూర్తయిన తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్‌తో ఈ నెల 28 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని తెలిపారు.

అన్ని దేశాల్లో జరుపుకునే పండుగ మే డే



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు గురువయ్య

హుజూర్‌నగర్ : ప్రపంచంలోని అన్ని దేశాల్లో కార్మికులు ఘనంగా జరుపుకునే పండుగ మేడే అని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురువయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ రైస్ మిల్ ఆవరణలో పార్ బాయిల్డ్ రైస్ మిల్ డ్రైవర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) సమావేశం యూనియన్ అధ్యక్షుడు సలిగంటి జానయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నిర్వహించే మేడే వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మావతి పాల్గొంటారని చెప్పారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాము, నాయకులు వీరబాబు, సుబ్బారావు, నాగరాజు, రాజు, శ్రీను, శ్రీనివాస్, బాలకృష్ణ, సీతారాములు, సైదులు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.